మన ప్రజా ప్రతినిధి

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :260 బుధవారం జూలై 15 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


# జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో

# ముడుపులు చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్లు




**అడిగినంత ఇస్తేనే రిజిస్ట్రేషన్లు,?జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి దందా యథావిధిగా కొనసాగుతోందని ఆ కార్యాలయానికి వచ్చే పలువురు ఆరోపిస్తున్నారు.? నిత్యం జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వివిధ రిజిస్ట్రేషన్ల నిమిత్తం సామాన్య ప్రజలు వస్తుంటారు !.అయితే రిజిస్ట్రేషన్ కోసం వస్తే వారికి ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు.?స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ల ఫీజుల కింద చలానా ఎంత కట్టాలో అంతే కట్టినా, అదనంగా ముడుపులు ఇస్తేనే చాలు కార్యాలయంలో ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?**

(తెలంగాణస్టేట్‌బ్యూరో ప్రత్యేక కథనం జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం):మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక నిఘాలో భాగంగా వారు అడిగినంత ఇవ్వలేకపోతే ఏదో ఒక సాకుతో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ?దీంతో కొందరు “ఎందుకొచ్చిన గొడవ“ అనుకుని, ముడుపులు ఇచ్చి మరీ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు.!పర్యవేక్షణ కొరవడుతోంది విక్రయదారుల ఆవేదన జగిత్యాల జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అవినీతి పెచ్చు మీరుతోందని విక్రయదారులు ఆరోపిస్తున్నారు.!దీనిని అరికట్టేందుకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, సామాన్య ప్రజలకు విముక్తి కల్పించి ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ ఫీజులకే రిజిస్ట్రేషన్లు చేయాలని వారు కోరుతున్నారు.?ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్న జగిత్యాల జిల్లాసబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే కార్యకలాపాలపై ఆడిట్‌కు వచ్చే అధికారులను ప్రసన్నం చేసుకుని, కార్యాలయంలో అన్ని పనులు నిబంధనల ప్రకారం, ఎలాంటి లోపాలు లేకుండా జరిగినట్లు నివేదికలు తీసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ?ఇప్పటికైనా ఉన్నతాధికారులు మొద్దునిద్ర వీడి, గత కొంతకాలంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన కార్యకలాపాలపై ప్రత్యేక విచారణ జరిపితే అధికారుల బాగోతం, అవకతవకలు బయటపడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. !మరి











ఇప్పటికైనా జగిత్యాల జిల్లా కలెక్టర్ అవినీతి నిరోధక శాఖ విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకుంటారా? లేదా మొద్దునిద్రకే పరిమితమవుతారా? అనేది జగిత్యాల జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు వేచి చూడండి అతి త్వరలో మీ ముందుకు మరో సంచలనాత్మక కథనంతో మీ మా మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక లో

# మన ప్రజాప్రతినిధి

ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :260 బుధవారం జూలై 15 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH


# కోవిడ్ టీకాపై స్పష్టత

- టీకాలతో గుండెపోటు ప్రమాదం లేదన్న అధ్యయనం
- 25 ఆస్పత్రుల్లో దేశవ్యాప్త పరిశోధన
- ధూమపానం, జీవనశైలే ప్రధాన ప్రమాదకారకాలు






న్యూఢిల్లీ, జూలై 14 (మనప్రజాప్రతినిధి): కోవిడ్-19 టీకాల వల్ల గుండెపోటు లేదా రక్తం గడ్డకట్టే ఘటనలు పెరిగాయన్న ప్రచారానికి భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) తాజా అధ్యయనం పూర్తి స్పష్టత ఇచ్చింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరిశోధనలో కోవిడ్ టీకాలకు గుండెపోటు లేదా రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టే సమస్యలతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని తేల్చింది. ముఖ్యంగా 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు గల వారిలో ఈ ప్రమాదాలు టీకాల వల్ల పెరగలేదని అధ్యయనం వెల్లడించింది. భారత వైద్య పరిశోధనా మండలి, జాతీయ అంటువ్యాధుల పరిశోధన సంస్థ సంయుక్తంగా దేశంలోని సుమారు 25 ఆస్పత్రుల్లో ఈ పరిశోధన చేపట్టాయి. 2021 నుంచి 2023 మధ్య నమోదైన గుండెపోటు, రక్తం గడ్డకట్టే ఘటనలను విశ్లేషిస్తూ ఈ అధ్యయనం నిర్వహించారు. టీకా తీసుకున్న వ్యక్తుల ఆరోగ్య వివరాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం ఈ నివేదికను విడుదల చేశారు. పరిశోధనలో భాగంగా 432 గుండెపోటు కేసులు, 767 రక్తం గడ్డకట్టే కేసులను విశ్లేషించారు. ఒకటి లేదా రెండు డోసుల కోవిడ్ టీకా తీసుకున్న వారిలో గుండెపోటు లేదా రక్తనాళాల్లో గడ్డలు ఏర్పడే ప్రమాదం పెరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని పరిశోధకులు స్పష్టం చేశారు. టీకాలపై ప్రచారంలో ఉన్న అనుమానాలకు శాస్త్రీయ ఆధారాలు లేవని నివేదిక పేర్కొంది. అయితే రక్తం గడ్డకట్టే సమస్యలకు ఇతర కారణాలు ప్రధానంగా ఉన్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. ధూమపానం, గతంలో ఉన్న ఆరోగ్య సమస్యలు, కుటుంబంలో హృద్రోగాలు లేదా రక్త సంబంధిత వ్యాధుల చరిత్ర, జీవనశైలి వంటి అంశాలు ఈ సమస్యలకు కారణమవుతున్నాయని గుర్తించారు. కాబట్టి ఈ పరిస్థితులను కోవిడ్ టీకాలతో ముడిపెట్టడం సరైనది కాదని పరిశోధకులు సూచించారు. భారత్‌లో కోవిడ్ టీకాల కార్యక్రమం ప్రజారోగ్య పరంగా మంచి ఫలితాలను ఇచ్చిందని అధ్యయనం పేర్కొంది. 2023 మే నాటికి అర్హులైన వారిలో సుమారు 97 శాతం మందికి కనీసం ఒక డోసు, దాదాపు 90 శాతం మందికి రెండు డోసులు అందించినట్లు తెలిపింది. ఆరోగ్య సిబ్బంది, వృద్ధులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి అదనపు డోసులు కూడా అందించినట్లు వివరించింది. కోవిడ్ టీకాల వల్ల వ్యాధి తీవ్రత తగ్గడంతో పాటు ఆస్పత్రుల్లో చేరే వారి సంఖ్య, మరణాల ప్రమాదం కూడా తగ్గినట్లు అధ్యయనం స్పష్టం చేసింది. దీర్ఘకాలిక కోవిడ్ సమస్యలను తగ్గించడంలో కూడా టీకాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొంది. ఈ అధ్యయనం ఐసీఎంఆర్‌జాతీయ అంటువ్యాధుల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ మనోజ్ మురేకర్ నేతృత్వంలో నిర్వహించగా, కోవిడ్ టీకాలపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించే కీలక ఆధారంగా ఈ నివేదిక నిలుస్తుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఎన్యూమరేషన్ ఫారం నింపిన కేటీఆర్



- ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు
- బీఆర్ఎస్ శ్రేణులకు అప్రమత్తంగా ఉండాలని సూచన

హైదరాబాద్, జూలై 14 (మనప్రజాప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కుటుంబ సభ్యులతో కలిసి ఎన్యూమరేషన్ ఫారాన్ని నింపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని పేర్కొంటూ అర్హులైన ప్రతి ఓటరు గడువు ముగిసేలోపు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న నేపథ్యంలో అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కోరారు.



బీఆర్ఎస్ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని కేటీఆర్ సూచించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు నింపడంలో అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ హక్కును కాపాడుకునేందుకు ఎన్యూమరేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి పార్టీ శ్రేణులు, బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, అర్హులైన ఎవరి ఓటు కూడా కోల్పోకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్
- పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలన్న నేతలు




హైదరాబాద్, జూలై 14 (మన ప్రజాప్రతినిధి): విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పాత విధానంలోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద తెలంగాణ విద్యార్థి సంఘాలు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తెలంగాణ విద్యార్థి జేఏసీ చైర్మన్ వేముల రామకృష్ణ, బీసీ జేఏసీ నాయకులు గుజ్జ కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గతంలో అమలు చేసిన విధంగానే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులు, వారి కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులపై రికవరీ చర్యలు చేపడతామని హెచ్చరించడం అత్యంత అన్యాయమని ఆయన విమర్శించారు. ఇలాంటి చర్యలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువులు కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక సమస్యల కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదని వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతోందని, అందువల్ల పథకాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంతో పాటు పాత విధానంలోనే పథకాన్ని కొనసాగించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు, బీసీ జేఏసీ నాయకులు, వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై ప్రభుత్వం ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# రామంతాపూర్ చెరువుకు విముక్తి

- హైడ్రా భారీ ఆక్రమణల తొలగింపు
- చెరువు పరిధిలోకి 2,180 గజాల భూమి



హైదరాబాద్, జూలై 14 (మనప్రజాప్రతినిధి): ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ పెద్దచెరువు పరిరక్షణలో భాగంగా హైడ్రా మంగళవారం భారీ ఎత్తున ఆక్రమణలను తొలగించింది. చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణాన్ని పునరుద్ధరించే చర్యల్లో భాగంగా మొత్తం 2,180 గజాల మేర ఆక్రమిత భూమిని తిరిగి చెరువు పరిధిలోకి తీసుకువచ్చింది. ఈ చర్యలతో చెరువు అభివృద్ధి పనులకు ఉన్న ప్రధాన అడ్డంకులు తొలగినట్లు అధికారులు తెలిపారు. రామంతాపూర్ పెద్దచెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణం 30 ఎకరాలు కాగా, అందులో సుమారు 16 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమిత ప్రాంతంలో దాదాపు 12 ఎకరాల మేర శాశ్వత నిర్మాణాలు ఉండగా, మిగిలిన నాలుగు ఎకరాల్లో తాత్కాలిక షెడ్లు, గుడిసెలు ఏర్పాటయ్యాయి. చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే క్రమంలో ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న సుమారు 1,900 గజాల వాణిజ్య భవనాన్ని హైడ్రా బృందాలు కూల్చివేశాయి. అలాగే 280 గజాల విస్తీర్ణంలో ఉన్న ఆటో గ్యారేజీని కూడా తొలగించాయి. ఈ రెండు నిర్మాణాలు చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణంలో ఉండటంతో చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు పరిసరాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాల పరిస్థితిని కూడా హైడ్రా పరిగణనలోకి తీసుకుంది. వర్షాకాలంలో చెరువు నిండితే గుడిసెలు నీట మునిగి ప్రతి ఏడాది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. చెత్త సేకరణ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గృహాల కేటాయింపునకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. రామంతాపూర్ పెద్దచెరువు అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.19 కోట్లతో పనులు చేపట్టింది. చెరువు పూర్తి స్థాయి నీటి విస్తీర్ణాన్ని పునరుద్ధరించడం, గట్ల బలోపేతం, సుందరీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి పనులు కొనసాగుతున్నాయి. ఆక్రమణలు తొలగించడంతో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని అధికారులు వెల్లడించారు. చెరువులను పరిరక్షించడం, వర్షపు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, భూగర్భ జలాలను సంరక్షించడం ప్రభుత్వ లక్ష్యమని హైడ్రా అధికారులు తెలిపారు. నగరంలోని చెరువుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి చట్టవిరుద్ధ నిర్మాణాలపై చర్యలు కొనసాగిస్తామని, ప్రజలు చెరువుల పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మన ప్రజాప్రతినిధి
బుధవారం జూలై 15 2026


# గడ్డిమందుపై నిషేధం

- కేంద్ర ప్రభుత్వ కీలక నిర్ణయం
- జూలై 14 నుంచే అమ్మకాల నిలిపివేత



న్యూఢిల్లీ, జూలై 14(మనప్రజాప్రతినిధి): రైతుల ప్రాణాలకు ముప్పుగా మారిన పారాక్వాట్ గడ్డిమందుపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి నిషేధం విధించింది. ఈ హానికరమైన రసాయనం విక్రయాలు, వినియోగాన్ని తక్షణమే నిలిపివేస్తూ కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం జూలై 14 నుంచే దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు ప్రకటించింది. ప్రాణాంతకమైన పారాక్వాట్ డైక్లోరైడ్ వినియోగంతో దేశవ్యాప్తంగా అనేక మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు నమోదవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. వ్యవసాయ పనుల్లో విస్తృతంగా వినియోగిస్తున్న ఈ గడ్డిమందు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తూ వస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 70కుపైగా దేశాలు పారాక్వాట్ వినియోగాన్ని నిషేధించగా, భారత్‌లో మాత్రం ఇప్పటివరకు దీని విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇటీవల వైద్య నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు ఈ రసాయనం వల్ల కలుగుతున్న ప్రమాదాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పారాక్వాట్ ప్రభావానికి గురైన వ్యక్తుల్లో తీవ్రమైన విష ప్రభావాలు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, కాలేయానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ఈ గడ్డిమందును పూర్తిగా నిషేధించింది. దేశవ్యాప్తంగా పారాక్వాట్ నిల్వలు, విక్రయాలు, వినియోగంపై సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నారు. నిషేధాన్ని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రైతులు పారాక్వాట్‌కు బదులుగా సురక్షితమైన ప్రత్యామ్నాయ కలుపు నివారణ పద్ధతులు, ఇతర ఆమోదిత గడ్డిమందులను మాత్రమే వినియోగించాలని వ్యవసాయ శాఖ సూచించింది. రైతుల ఆరోగ్య పరిరక్షణ, సురక్షిత వ్యవసాయ విధానాల ప్రోత్సాహమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

# సింగరేణికి కేంద్రం భరోసా

- కిషన్ రెడ్డి భరోసా యాత్ర కొనసాగింపు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి విమర్శలు



గోదావరిఖని, జూలై 14 (మన ప్రజాప్రతినిధి): సింగరేణి సంస్థ బలోపేతం, కార్మికుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన సింగరేణి భరోసా యాత్ర రెండో రోజు రామగుండం, గోదావరిఖనిలో కొనసాగింది. యాత్రకు సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన కిషన్ రెడ్డి, సింగరేణి సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి, కార్మికుల భవిష్యత్తు మరింత భద్రంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు. తాడిచెర్ల2 బొగ్గు బ్లాక్ కేటాయింపుతో సంస్థకు దీర్ఘకాలికంగా బొగ్గు నిల్వలు అందుబాటులోకి వస్తాయని, ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ విధానమని కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, భద్రత, సంస్థ అభివృద్ధికి అవసరమైన ప్రతి చర్యను కేంద్రం తీసుకుంటోందని స్పష్టం చేశారు. కార్మికుల శ్రమే దేశ పారిశ్రామికాభివృద్ధికి బలమని కొనియాడారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు సింగరేణి సంస్థను బలోపేతం చేయకుండా ఆదాయ వనరుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. సంస్థ ఆదాయాన్ని ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల ఆర్థిక పరిస్థితి బలహీనపడిందని, కార్మికుల సంక్షేమం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆర్థిక ఇబ్బందులతో ఉద్యోగుల జీతాల చెల్లింపులకు కూడా బ్యాంకుల నుంచి ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఈ పరిస్థితికి గత ప్రభుత్వాల విధానాలే కారణమని పేర్కొన్నారు. సంస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. సింగరేణి భరోసా యాత్ర ద్వారా కార్మికులతో నేరుగా మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. యాత్రలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వెలుగులోకి రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో

- హత్యలకు ముందు రోజు ఆవేదన
- మోసపోయానంటూ వీడియోలో వ్యాఖ్యలు



హైదరాబాద్, జూలై 14 (మనప్రజాప్రతినిధి): షాబాద్‌లో సంచలనం సృష్టించిన బహుళ హత్యల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నిందితుడు రాజ్‌కుమార్ హత్యలకు ఒక రోజు ముందు, జూలై 10న రికార్డు చేసిన సెల్ఫీ వీడియో వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో తన జీవితంలో ఎదురైన ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యల గురించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. వీడియోలో యువతిని నమ్మి అన్ని విధాలుగా మోసపోయానని, ఆమె కుటుంబానికి పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో అప్పుల పాలయ్యానని రాజ్‌కుమార్ పేర్కొన్నట్లు సమాచారం. ఆ పరిణామాల వల్ల తన కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడిందని, పిల్లలకు ఇవ్వాల్సిన ఆస్తి కూడా కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి కలిగిందని, తన పరిస్థితికి ఆర్థిక సమస్యలే ప్రధాన కారణమని వీడియోలో చెప్పినట్లు సమాచారం. ఈ వీడియో ప్రస్తుతం దర్యాప్తులో కీలక ఆధారంగా మారినట్లు తెలుస్తోంది. అయితే వీడియోలో చేసిన ఆరోపణలు రాజ్‌కుమార్ వ్యక్తిగత వాదనలు మాత్రమేనని, వాటి నిజానిజాలను పోలీసులు దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. షాబాద్ బహుళ హత్యల కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో ఈ సెల్ఫీ వీడియో బయటకు రావడం మరింత చర్చనీయాంశమైంది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర కారణాలపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్న పోలీసులు వీడియోతో పాటు ఇతర డిజిటల్ ఆధారాలను కూడా పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే ఘటనకు దారితీసిన అసలు కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# పాఠశాలల్లో లైంగిక విద్యకు కేంద్రం ప్రతిపాదన



న్యూఢిల్లీ, జూలై 14 (మనప్రజాప్రతినిధి): దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో వయస్సుకు తగిన సమగ్ర లైంగిక విద్యను ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెల్లడించింది. 26 మంది సభ్యులతో కూడిన జాతీయ నిపుణుల కమిటీ సిఫారసుల మేరకు రూపొందించిన ఈ కార్యక్రమాన్ని సుప్రీంకోర్టు ఆమోదించిన అనంతరం అమలు చేయనున్నట్లు తెలిపింది. పిల్లల భద్రత, ఆరోగ్యకరమైన వికాసం, లైంగిక దాడుల నుంచి రక్షణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం ముందు అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ వివరాలను వెల్లడించారు. జాతీయ నిపుణుల కమిటీ సమర్పించిన సిఫారసులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించినట్లు కోర్టుకు తెలియజేశారు. పిల్లలకు వయస్సుకు అనుగుణంగా అవగాహన కల్పించే విధంగా దేశవ్యాప్తంగా ఒకే విధమైన పాఠ్య ప్రణాళిక రూపొందించాలని కమిటీ సూచించినట్లు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే సమగ్ర లైంగిక విద్యను పాఠ్యాంశాల్లో చేర్చాలని నివేదికలో ప్రతిపాదించారు. వారానికి కనీసం రెండు రోజులు 15 నుంచి 20 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ఇందుకోసం ప్రతి పాఠశాలలో ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుడిని నియమించాలని కమిటీ సిఫారసు చేసింది. ఈ పాఠ్యాంశాల్లో శరీర భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, శరీర భాగాలపై అవగాహన, సురక్షితమైన మరియు అసురక్షితమైన స్పర్శను గుర్తించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్యార్థుల వయస్సు పెరిగే కొద్దీ కౌమార ఆరోగ్యం, సంబంధాలు, జీవిత నైపుణ్యాలు వంటి అంశాలను కూడా దశలవారీగా బోధించేలా ప్రణాళిక రూపొందించారు. తల్లిదండ్రులు, సంరక్షకులు, ఉపాధ్యాయుల కోసం కూడా క్రమం తప్పకుండా అవగాహన సమావేశాలు నిర్వహించాలని కమిటీ సూచించింది. పిల్లల ఎదుగుదల దశలు, వారి భద్రత, శారీరకమానసిక శ్రేయస్సును కాపాడడంలో కుటుంబ సభ్యుల పాత్రపై అవగాహన కల్పించడమే ఈ సమావేశాల లక్ష్యమని పేర్కొంది. మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో విద్యా, మానసిక ఆరోగ్య, న్యాయ నిపుణులు, కేంద్రరాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పాల్గొన్నారు. మైనర్లపై లైంగిక నేరాల నివారణ, పిల్లల భద్రత, కౌమార దశలో సరైన అవగాహన కల్పించేందుకు సమగ్ర విధానాన్ని రూపొందించాలన్న సుప్రీంకోర్టు సూచనల మేరకు ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# ముద్రగడకు జగన్ నివాళి

- సీనియర్ నేత మృతిపై తీవ్ర దిగ్భ్రాంతి
- కాపు ఉద్యమ నేత సేవలు చిరస్మరణీయమన్న జగన్





తాడేపల్లి, జూలై 14 (మన ప్రజాప్రతినిధి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీనియర్ రాజకీయ నాయకుడు ముద్రగడ పద్మనాభం మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ముద్రగడ మరణవార్త తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ముద్రగడ క్రమంగా కోలుకుంటున్నారనే సమాచారం తమకు ఆశను కలిగించిందని జగన్ తెలిపారు. పూర్తిగా కోలుకుని తిరిగి ప్రజల మధ్యకు వస్తారని భావిస్తున్న సమయంలో ఆయన మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. ఐదు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎంపీగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు విశిష్ట సేవలు అందించిన నాయకుడిగా ముద్రగడ గుర్తింపు పొందారని జగన్ పేర్కొన్నారు. రాజకీయ విలువలకు కట్టుబడి పనిచేసిన ఆయన పదవుల కంటే ప్రజా సేవకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారని కొనియాడారు. కాపు సామాజిక వర్గానికి పెద్ద దిక్కుగా నిలిచి వారి హక్కులు, సంక్షేమం కోసం జీవితాంతం పోరాటం చేశారని జగన్ అన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకుడిగా, ఆత్మగౌరవం, నిజాయితీ, వ్యక్తిత్వానికి ప్రతీకగా ముద్రగడ నిలిచారని పేర్కొన్నారు. ముద్రగడ మరణం ఆయన కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆయనను అభిమానించే లక్షలాది మందికి తీరని లోటని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సేవలు చిరకాలం ప్రజల మదిలో నిలిచిపోతాయని అన్నారు. ఈ విషాద సమయంలో ముద్రగడ కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు జగన్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ముద్రగడ పద్మనాభంకు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు వెల్లడించారు

# కర్ణాటకకు ఏఐ రాజధాని లక్ష్యం

బెంగళూరు, జూలై 14 (మనప్రజాప్రతినిధి): బెంగళూరులో నిర్వహించిన “గూగుల్ ఐ/ఓ కనెక్ట్ ఇండియా2026“ కార్యక్రమాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రాన్ని దేశానికి కృత్రిమ మేధస్సు రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. సాంకేతిక రంగంలో కర్ణాటక ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని, భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు రంగంలోనూ అగ్రస్థానంలో నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఐదు కృత్రిమ మేధస్సు నగరాల్లో బెంగళూరు ఒకటిగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశంలోని మొత్తం యూనికార్న్ సంస్థల్లో దాదాపు 40 శాతం కర్ణాటకలోనే ఉన్నాయని తెలిపారు. గత విజయాలతో సంతృప్తి చెందకుండా రాష్ట్రాన్ని సాంకేతిక రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు స్పష్టమైన కార్యాచరణతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోనే తొలి, అతిపెద్ద కృత్రిమ మేధస్సు విశ్వవిద్యాలయం, కృత్రిమ మేధస్సు ఆవిష్కరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కృత్రిమ మేధస్సు విద్యను పరిచయం చేయడంతో పాటు, ఈ రంగానికి అవసరమైన అత్యాధునిక మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. బెంగళూరు సమీపంతో పాటు తీర ప్రాంత జిల్లాల్లో పర్యావరణహిత అత్యాధునిక సమాచార నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే “బియాండ్ బెంగళూరు“ విధానంలో భాగంగా మైసూరు, మంగళూరు, హుబ్బళ్లిధారవాడ, బెలగావి, కలబురగి నగరాలను కూడా ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. దీంతో

# SIR ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

## కొమురవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.ఓటరు జాబితా సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే.కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కొమురవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూSIRప్రక్రియలో ప్రతి ఓటరు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని, అవసరమైన పత్రాలు సమర్పించి తమ ఓటు నమోదును నిర్ధారించుకోవాలని సూచించారు.ఈ ప్రక్రియలో పాల్గొనకపోతే ఓటరు జాబితా నుంచి పేరు తొలగిపోయే అవకాశం ఉండి,ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.ప్రతి బూత్ లెవల్ ఏజెంట్,గ్రామ శాఖ అధ్యక్షుడు,సర్పంచ్, కాంగ్రెస్ కార్యకర్త తమ పరిధిలోని ప్రతి అర్హులైన ఓటరికSIR ప్రక్రియపై అవగాహన కల్పించి,ఎవరి ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వివిధ మండలాలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు,కాంగ్రెస్ పార్టీ సర్పంచులు,గ్రామ శాఖ అధ్యక్షులు,క్రియాశీలక కార్యకర్తలు మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు,పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట

## జాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో నూతన నియామకాలు!



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,దూల్మిట్ట, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం దూల్మిట్ట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ సిస్టం,ను బలోపేతం చేస్తూ అమలు చేస్తున్న నేపథ్యంలో, ఎం పి యు పి ఎస్. జాలపల్లి పాఠశాలలో మంగళవారం రోజున ఇన్స్ట్రక్టర్ గా శ్రీమతి పోతన అర్చన,ఆయా గా శ్రీమతి నర్మెట నిర్మల అధికారికంగా జాయిన్ అయ్యారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చెట్కూరి కమలాకర్ యాదవ్, మాట్లాడుతూ,ఈ సెలక్షన్ ప్రాసెస్ పూర్తిగా ట్రాన్స్పరెంట్ గా మరియు ఫెయిర్ మెరిట్ బేస్డ్,విధానంలో జరిగిందని తెలిపారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, చిన్నారులకు క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించడంలో అంకితభావంతో పనిచేసి, ఎంపియుపిఎస్.జాలపల్లి,మన గ్రామానికి,అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు హేమచందర్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కూడా వారిద్దరికీ అభినందనలు తెలియజేస్తూ,తమ విధులను ను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసం నిబద్ధతతో సేవ చేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఇన్ స్ట్రక్టర్ పోతన అర్చన,ఆయా నర్మెట నిర్మల,తమకు ఈ అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# నూతనంగా పదవులు చేపట్టిన కాంగ్రెస్ నాయకులకు సన్మానం



మనప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.చేర్యాల మండలం,పోతిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల,ఆధ్వర్యంలో నూతనంగా పదవులు చేపట్టిన చేర్యాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంజె మల్లేశం,మరియు సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పూర్మ ఆగంరెడ్డి ని ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్టేట్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రాకేష్ కృష్ణన్,మండల నాయకులు మరియు గ్రామ నాయకులు లింగంపల్లి గౌరయ్య,పోరెడ్డి వెంకటేశం,కత్తుల ప్రభాకర్ రెడ్డి,ఎండీ వహీద్ ఖాన్,జిల్లా వెంకటేశం,ల్యాగల కృష్ణ,మల్లారెడ్డి,దుబ్బాక బాలయ్య,రమేష్,గడ్డం రాజు,లింగపల్లి సురేందర్,బాబు,ల్యాగాల సందీప్,యూత్ నాయకులు గ్రామ నాయకులు,శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

# ప్రతి మంగళవారం ప్రతి శుక్రవారం "డ్రై డే" పాటించి వర్షపు నీటిని సంరక్షిద్దాం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.చేర్యాల పట్టణ కేంద్రంలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,ప్రతి మంగళవారం "డ్రై డే" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.వర్షాకాలం నేపథ్యంలో దోమల పెరుగుదలను అరికట్టేందుకు ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఇంటి చుట్టూ నిల్వ ఉన్న నీటిని తొలగించడం,నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయడం,పాత టైర్లు,కొబ్బరి చిప్పలు,కూలర్లు,పూల కుండీలు,వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.అదే విధంగా,వర్షపు నీటిని వృథా కాకుండా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించే చర్యలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ప్రతి పౌరుడు పరిశుభ్రత, ఆరోగ్యం మరియు నీటి సంరక్షణపై బాధ్యతతో వ్యవహరిస్తే ఆరోగ్యకరమైన చేర్యాల నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కార్మికులు,వార్డు ప్రజలు,పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజక వర్గం.జనగామ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనగామ పట్టణం,మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదా రులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం ముప్పై తొమ్మిది మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేసి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...కళ్యాణలక్ష్మి చెక్కులు కొంతకాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని గుర్తించి,వాటిని త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు తాను ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు.ఎంఆర్ఓ,ఆర్డీఓ,కలెక్టర్ కార్యాలయ అధికారులతో పలుమార్లు చర్చించి,పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు.అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు ఆలస్యం కాకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి నట్లు తెలిపారు.ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే తాను పాల్గొనే ప్రతి కార్యక్రమంలోనే కళ్యా ణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో చేరేలా చూడటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని,అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాల కు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ఈ పథకం వల్ల పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గడంతో పాటు వారికి ఆర్థిక భరోసా కలుగుతోందని తెలిపారు.

# కొమ్మూరి ఆధ్వర్యంలో SIR పై కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గ స్థాయి SIR ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ సమీక్ష సమావేశం. మంగళవారం రోజున చేర్యాల పట్టణంలో కళ్యాణి గార్డెన్ లో జరిగిన కార్యక్రమనికి జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ.లు అందరూ కష్టపడి పనిచేస్తున్నారని. అలాగే వారితోపాటు గ్రామ,మండల సాయి నాయకులు కూడా బి ఎల్ ఎ.లకు సహకరించాలని ప్రతి ఒక్కరు త్వరగా అన్ని గ్రామాలలో SIR ఫామ్ లు నింపాలి.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పూర్మ ఆగం రెడ్డి మండల అధ్యక్షులు మంజ మల్లేశం,మహాదేవుని శ్రీనివాస్,దాసరి శ్రీకాంత్, జిల్లా SIR కో ఆర్డినేటర్ మెడ శ్రీనివాస్,చెంచరపు కరుణాకర్ రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మెన్ జక్కుల తిరుపతి,జిల్లా,మండల,నాయకులు,పాల్గొన్నారు.

# మహంకాళి ఆలయంలో పసుపు అభిషేకాలు

## శ్రీ వారాహి గుప్త నవరాత్రులు!



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 14 చేగుంట పట్టణ కేంద్రంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో లోక కళ్యాణార్థం,అమావాస్య, మంగళవారం పురస్కరించు కుని, శ్రీ మహంకాళి అమ్మవారికి 21 పసుపులతో విశేష అభిషేకం నిర్వహించారు. చేగుంట మండల గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, అన్నదాతలు అందరూ సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ దేవాలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పురంలో రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా జరిపించారు. ఇదే సందర్భంలో శ్రీ వారాహి నవరాత్రులు (గుప్త నవరాత్రులు) ప్రారంభమవుతున్నందున భక్తజను లందరూ పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి సేవలో పాల్గొని అనుగ్రహాన్ని పొందాలని అర్చకులు కోరారు. ఇట్టి పవిత్ర నవరాత్రి మహోత్సవాలను దేవాలయ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, చేగుంట గ్రామ ప్రజలందరూ ఏకతాటిపై నిలబడి అంగరంగ వైభవంగా విజయవంతం చేయవలసిందిగా రాఘవేంద్ర శర్మ పిలుపునిచ్చారు.

# విద్యార్థుల హక్కుల కోసం పోరాడితే అక్రమ అరెస్టులా?

## స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.. చిలకరాజు శ్రీను డిమాండ్



నేరేడుచర్ల: (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక)రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి, యువజన నాయకులపై ముందస్తు అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని AIYF సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, మండల అధ్యక్షులు పరికె భరత్, పట్టణ అధ్యక్షులు వడ్లాల భాస్కర్ తీవ్రంగా ఖండించారు.లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా, సమస్యపై ప్రశ్నించిన వారినే లక్ష్యంగా చేసుకుని అక్రమ అరెస్టులు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, ఆ హక్కును అణచివేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన AIYF నాయకులను వెంటనే విడుదల చేసి, నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను అణచివేస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ,AIYF నాయకులు పాల్గొన్నారు

# మనస్థాపంతో రైలు పట్టాల కింద పడుకొని వ్యక్తి ఆత్మహత్య

జనం న్యూస్,జూలై 14, మసాయిపేట్ ప్రతినిధి మొహమ్మద్ ముజామిల్:భార్యతో విడాకులు తీసుకొని మనస్థాపంతో రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మాసాపేట రైల్వే స్టేషన్ సమీపంలోని బంగారమ్మ ఆలయం సమీపంలో చోటుచేసుకుంది , కామారెడ్డి రైల్వే పోలీస్ వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం తిమ్మాకపల్లి గ్రామానికి చెందిన మిక్కిలి భాస్కర్ రెడ్డి(33) కొన్నేళ్లుగా మనోహరాబాద్ లో నివాసం ఉండేవాడు, కుటుంబ కలహాలతో భార్యతో విడాకులు తీసుకొని మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలోని బంగారమ్మఆలయ సమీపంలో తన ద్విచక్ర వాహనం పార్క్ చేసి రైల్ పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు. విషయం తెలుసుకున్న కామారెడ్డి రైల్వే పోలీసులకు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకల పల్లి పెంటయ్య




మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూలై 14: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు మెదక్ కలెక్టర్ ఆఫీస్ ముందు తపస్ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య మాట్లాడుతూ పిఆర్సిని ప్రకటించి అమలు చేయాలి ,సి పి ఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలి అని,, జీ ఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె కాలపు ఒక నెల వేతనాన్ని చెల్లించాలని , 2003 డిఎస్సి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఇక్కడ కూడా వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి అని, కేజీబివి, మోడల్ స్కూల్, గురుకులల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వారు అన్నారు.ఈ కార్యక్రమం లో మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జాల సిద్దూ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దుబాషి భాస్కర్, రాష్ట్ర కోశాధికారి దేశ్ భాస్కర్, రాష్ట్ర బాధ్యులు చల్లా లక్ష్మణ్, రంగారెడ్డి,ఆర్వి రామారావు, రమేష్,జిల్లా బాధ్యులు మంగ నర్సింలు,మార్గం రాజు, మాధవరెడ్డి, శ్రీధర్ రెడ్డి,సాగరిక, దివ్య, శోభారాణి, మార్గం రాజు, మెట్టు శేఖర్,దేశపతి కృష్ణమూర్తి, ప్రవీన్, శ్రీకాంత్ రెడ్డి,సురేందర్, ఈగ కృష్ణమూర్తి, భాస్కర్ రావు , శివ కుమార్, రవి, వెంకటేష్, మనీష్ రెడ్డి, నాగవేందర్ తదితరులు పాల్గొన్నారు

# కన్నకొడుకే తల్లిని కిరాతకంగా....

మన ప్రజాప్రతినిది.దుబ్బాక మండలం.: సిద్దిపేట జిల్లా. దుబ్బాక మండల పరిధిలోని హాసన్ మీరాపూర్ గ్రామంలో కన్న కొడుకే తల్లిని కిరాతకంగా చంపాలని ప్రయత్నించిన బల్తే మహేష్,భార్య పల్లవి.కుర్మా బాల్తే లక్ష్మి భర్త బాలయ్య కుమారుడు బాల్తే మహేష్ భార్య పల్లవి అను వ్యక్తి కన్నతల్లికి తిండి పెట్టలేక పది సంవత్సరాలుగా సరిగా చూడకుండా ఉండడానికి నీడ లేదు తినడానికి తిండి లేదు కట్టుకోవడానికి బట్టలేదు గ్రామంలోనికూలి పని చేసుకొని జీవనం గడిపేది. లక్ష్మి కొడుకుమహేష్ కు గ్రామపెద్దలు ఎన్నోసార్లు మీ తల్లికి తిండి పెట్టుమన్నారు.గ్రామపెద్దల మాటలు వినకుండా తన తల్లిని కొట్టడం హింసించడం. ఈ విషయంలో నాలుగు ఐదు సార్లు పోలీస్ స్టేషన్ కు కూడా వెళ్లడం జరిగింది . ఆయన మహేష్ తన బుద్ధి మారలేదు ఈరోజు తన తల్లి పై గొడ్డలి కామతో చంపేస్తా అని తలపై గట్టిగా కొట్టడం జరిగింది వెంటనే తల్లి స్పృహ కోల్పోయింది. దుబ్బాక పోలీస్ వారికిగ్రామస్తులు సమాచారం అందించారు.. సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు తలపై 11 కుట్లు పడ్డాయి. పోలీసు వారు మహేష్ కు ఎన్నో సార్లు హెచ్చరించిన వినకుండా కన్నతల్లిపై ఈరోజు అతి కిరాతకంగా తలపై కొట్టడంతో తీవ్ర గాయాల పాలు కావడం జరిగింది . బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుచున్నారు. సమాచారం అందిన వెంటనే దుబ్బాక ఎస్సై కీర్తి రాజు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి బాధితురాలని పరామర్శించి కేసు నమోదు చేసుకుని పంచినామ చేసారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు కోరారు.



# పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేయాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేసి అభియోగపత్రాన్ని నిర్ణీత గడువులోగా న్యాయస్థానంలో సమర్పించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారుల నేరసమీక్ష సమావేశం పోలీస్ కాన్ఫిరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...నేర విచారణలో నిందితులకు శిక్షల శాతం పెరగడం అత్యంత ముఖ్యమని, దీనికోసం పకడ్బందీ దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాల సేకరణ, పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయం అవసరమన్నారు. కొత్త చట్టాల ప్రకారం నిర్ణీత గడువులోగా ట్రయల్ పూర్తి చేయాలని, సాక్షులు భయపడకుండా భరోసా కల్పిస్తూ...న్యాయస్థానానికి హాజరయ్యేలా చూడాలన్నారు.ఎన్డీపీఎస్ కేసులో న్యాయస్థానంలో నేరాన్ని రుజువు చేయడానికి ఆయా కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి / మాదకద్రవ్యాల స్వభావం, పరిమాణాన్ని శాస్త్రీయంగా నిర్ధారించే ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ నివేదిక ప్రధాన ఆధారమని అన్నారు. అదేవిదంగా జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలను అరికట్టడానికి స్పెషల్ దృష్టి పెట్టాలని, ఈగల్ బృందాలు, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసుల సమన్వయంతో మూలలను కనిపెట్టాలని అన్నారు.వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేస్తూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. చోరీల నివారణకు, దొంగిలించబడిన సొత్తును బాధితులకు తిరిగి అప్పగించడానికి పోలీసులు సాంకేతికతను ఉపయోగిస్తూ రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టాలాని, నిందితుల గుర్తింపు, రికవరీ వేగవంతం చెయాలన్నారు.విచారణలో భాగంగా ప్రతి కేసు ను సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ సాక్ష్యాలను సమర్థవంతంగా వినియోగించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు.శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేస్తూ...నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే..ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.శాంతిభద్రతలు,నేరాల ధోరణి, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లు లేదా బ్లాక్ స్పాట్‌లలో ప్రాణనష్టాన్ని నివారించడానికి రోడ్డు భద్రతా చర్యలు, ఇంజనీరింగ్ మార్పులు, కఠినమైన ట్రాఫిక్ నియంత్రణలు చాలా ముఖ్యన్నారు. ప్రమాదకర మలుపులు, కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ బ్రేకర్లు, రంబిల్ స్ట్రిప్స్, గరిష్ఠ వేగపరిమితి సూచికలు పెట్టడం, రాత్రి సమయంలో స్పష్టత కోసం సోలార్ లైట్లు, వీధి దీపాలు మెరుగుపరచడం. గుంతలను పూడ్చడం, జారుడు రోడ్లకు తగిన గుర్తులు వేయడం వంటి చర్యలు సంబంధిత అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు వసుందర యాదవ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, సారంగపాణి, ఫణిందర్,నర్సింహారావు, సర్వర్, సత్యనారాయణ, సాంబరాజు పాల్గొన్నారు.

# హత్య కేసులో జీవిత ఖైదు, పది వేలు జరిమానాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాసిక్యూషన్ కు సహకరించిన అధికారులను అభినందించిన పోలీస్ కమిషనర్ హత్య కేసులో వరంగల్ జిల్లా, ధర్మసాగర్ మండలం, పెద్ద పెండ్యాల గ్రామానికి చెందిన రాప్రోలు వెంకటేశ్వర్లు అలియాస్ రాజు,32 సం,,కు జీవిత ఖైదు, 10 వేలరూపాయలు జరిమానా విధిస్తూ.. నాలుగోవ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డా. జి.వి. మహేష్ నాథ్ తీర్పు వెల్లడించారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..2021 ఫిబ్రవరి 13 న రాత్రి సమయంలో ఖమ్మం నగరంలో వినోద్ థియేటర్ వద్ద ఓ వివహిత తో మాట్లాడుతున్న శీలం వెంకటేష్ అనే వ్యక్తిపై రాప్రోలు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి పాత కక్ష పెంచుకొని హత్య చేసేందుకు కత్తితో పొడిచి పారిపోయాడు.బాధితుడి బంధువు అయిన ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాపు పూర్తి చేసి అభియోగ పత్రాన్ని న్యాయంస్థానంలో సమర్పించగా..వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ కు సహకరించిన పోలీసు అధికారులకు, ఇన్వెస్టిగేషన్ అధికారులు ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. స్వప్న, కోర్టు కానిస్టేబుల్ యం. రామకృష్ణ,కోర్టు.లైజన్ ఎస్సై శ్రీకాంత్, హోంగార్డ్ శ్రీనివాస్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు

# సూర్యాపేట పాత బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్సై యాడవెందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు:డ్రైవింగ్ లైసెన్స్: ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ మరియు వాహన పత్రాలను కలిగి ఉండాలిమద్యం సేవించి వాహనం నడపరాదు: మద్యం మత్తులో ఆటోలు నడపడం వల్ల అమాయక ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫిక్ సిగ్నల్ నియమాలు: జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సిగ్నల్ జంపింగ్ చేయవద్దని స్పష్టం చేశారు.పరిమితికి మించి ప్రయాణికులు: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని ఎస్సై తెలిపినారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ముగ్గురు అక్రమ గంజాయి రవాణా, సరఫరాదారుల అరెస్ట్




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:కల్లూరు పోలీస్ స్టేషన్ ఖమ్మం నిందితుల నుండి లక్ష యాభై వేల రూపాయల విలువ చేసే గంజాయి స్వాధీనం సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం గంజాయి మత్తుకు అలవాటు పడి, సరఫరా చేస్తున్న కల్లూరు పట్టణానికి చెందిన షేక్ హబీబ్, బొడ్డు చందులు, మణుగూరుకు చెందిన తేజావత్ రమేష్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సత్తుపల్లి రూరల్ సిఐ ముత్తులింగం తెలిపారు. గత ఏడాది 2025 సంలో షేక్ హబీబ్ అనే నిందితుడు స్నేహితులతో కలిసి ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి వెళ్లి సన్నీ అనే వ్యక్తి దగ్గర నుండి గంజాయి కొనుగోలు చేసి కల్లూరులో చిన్న ప్యాకెట్లుగా చేసి త్రాగే అలవాటు ఉన్నవారికి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించరాని తెలిపారు. జైలు నుంచి విడుదలైన తర్వాత హబీబ్ కొద్దికాలం బాగానే ఉంటూ కల్లూరులోని ఒక రెస్టారెంట్లో పనిచేశాడని, ఇటీవల ఎటువంటి పని లేకపోవడంతో మణుగూరు అత్తగారింటికి వెళ్ళినప్పుడు పాత స్నేహితుడైన తేజావత్ రమేష్ కలువగా కలిసి ఇరువురు గంజాయి సేవించారని, దాంతో మరల అలవాటు పడి, కల్లూరు వచ్చిన తర్వాత గంజాయి కోసం బొడ్డు చందుని సంప్రదించగా చందు కొద్దిమొత్తంలో 500 రూపాయలకు ముద్దునూరు లో తెచ్చి ఇచ్చాడని, కానీ ధర ఎక్కువగా ఉండడం, గంజాయి తక్కువ రావడంతో హబీబ్, చందులు మరల ఒరిస్సా రాష్ట్రం మల్కనగిరి కి జులై 7 న వెళ్లినారని, అలా వెళ్ళుటకు వాహనం ఏర్పాటు చేసినందుకు తేజవత్ రమేష్ గంజాయిలో వాటా అడగటంతో 500 గ్రాములు తేజవత్ రమేష్ కి ఇచ్చారని తెలిపారు. కల్లూరు వచ్చిన తర్వాత అట్టి గంజాయిని అమ్ముటకు చందు ద్వారా పేరవంచ గ్రామానికి చెందిన ప్రవీణ్, చిన్న ప్రవీణ్, హరీష్ లను సంప్రదించగా వారు ఒప్పుకున్నారని, దాంతో తేజావత్ రమేష్ దగ్గర ఉన్న అరకేజీ కూడా తెప్పించి, ముగ్గురు కలిసి మొత్తం మూడు కేజీలు అమ్మి మల్కనగిరి వెళ్లి మరలా పెద్ద మొత్తంలో లాభాల దురుద్దేశంతో హబీబ్, చందు, రమేష్ లు జులై 13 న బండిపై పేరువంచ వెళ్ళుచుండగా షుగర్ ఫ్యాక్టరీ దగ్గర వాహనాలు తనిఖీలో గంజాయితో పోలీసు పట్టుకున్నారని తెలిపారు. ఇట్టి గంజాయి విలువ ఒక కేజీ రూ 50 వేలు చొప్పున మొత్తం మూడు కెజీ లు రూ 1,50,000 ఉంటుందని తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని అన్నారు. ఈ కేసు దర్యాప్తులో లో ఎస్సై హరిత, హెడ్ కానిస్టేబుల్ నరసింహారావు, లక్ష్మీపతిలు, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, సత్యనారాయణ, రఫీ, విజయ్, రంగారావులు సహకరించినందున అబినందించారు. గంజాయి అక్రమ కొనుగోలు చేసిన, రవాణాకు పాల్పడిన, విక్రయించిన, సేవించిన నేరమని వారిపై చట్టరీత్య చర్యలు కఠిన చర్యలు చేపట్టబడతాయని అన్నారు.ఇలాంటి నేరాలకు పాల్పడే వారి సమాచారం తెలిపిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడుతుందని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# బోరు మోటార్ మరమ్మతులో జాప్యం
# వారం రోజులుగా కాలనీవాసుల తీవ్ర ఇబ్బందులు

మనప్రజాప్రతినిధి//రాజన్నసిరిసిల్ల జూలై ,14:రాజన్నసిరిసిల్లజిల్లా లోనిసిరిసిల్ల పట్టణంలోని స్థానిక 33వ వార్డు పరిధిలోని అంబాభవాని రోడ్డులో ఉన్న బోరు మోటార్ గత వారం రోజులుగా పాడై ఉండటంతో కాలనీవాసులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం మోటార్ చెడిపోగా, మున్సిపల్ సిబ్బంది దానిని మరమ్మతు చేస్తామనే సాకుతో ఇక్కడి నుండి విప్పి తీసుకెళ్లారు. అయితే, వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు సదరు మోటారును తిరిగి బిగించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాధారణంగా పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడినప్పుడు, కాలనీ ప్రజలంతా ఈ బోరు బావి ద్వారానే తాగునీటిని సేకరించుకునేవారని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం అత్యవసర నీటి అవసరాలు తీర్చే ఈ బోరు కూడా పనిచేయకపోవడంతో, రాబోయే రోజుల్లో ఒకవేళ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే తమ పరిస్థితి ఏమిటని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే

# బోరు మోటార్ మరమ్మతులో జాప్యం
# వారం రోజులుగా కాలనీవాసుల తీవ్ర ఇబ్బందులు



మనప్రజాప్రతినిధి//రాజన్నసిరిసిల్ల జూలై ,14:రాజన్నసిరిసిల్లజిల్లా లోనిసిరిసిల్ల పట్టణంలోని స్థానిక 33వ వార్డు పరిధిలోని అంబాభవాని రోడ్డులో ఉన్న బోరు మోటార్ గత వారం రోజులుగా పాడై ఉండటంతో కాలనీవాసులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల క్రితం మోటార్ చెడిపోగా, మున్సిపల్ సిబ్బంది దానిని మరమ్మతు చేస్తామనే సాకుతో ఇక్కడి నుండి విప్పి తీసుకెళ్లారు. అయితే, వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు సదరు మోటారును తిరిగి బిగించక పోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాధారణంగా పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడినప్పుడు, కాలనీ ప్రజలంతా ఈ బోరు బావి ద్వారానే తాగునీటిని సేకరించుకునేవారని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం అత్యవసర నీటి అవసరాలు తీర్చే ఈ బోరు కూడా పనిచేయకపోవడంతో, రాబోయే రోజుల్లో ఒకవేళ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే తమ పరిస్థితి ఏమిటని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే బోరు మోటారుకు మరమ్మతులు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి...



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కూసుమంచి మండలంలో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖమ్మం/ కూసుమంచి కూసుమంచి మండలంలో చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, 100 పడకల ఆసుపత్రుల నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పురోగతి, నాణ్యత, పనుల వేగంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి, కూసుమంచిలో విద్య అభివృద్ధికి కీలకమైన జూనియర్ కళాశాల పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మండల కేంద్రంలో చేపట్టిన ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి అయితే మండలం చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, నిర్మాణ పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా, ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.పనుల సందర్భంగా అవసరమైన నిర్మాణ సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షించాలని, ప్రతి దశను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ తనిఖీలో వైద్యశాఖ, విద్యశాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉమామహేశ్వర రావు, బుగ్గయ్య, కూసుమంచి తహసీల్దారు సైదులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నక్షత్ర మొక్క నాటిన సర్పంచ్ దంపతులు...!



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జులై 14: చేగుంట పట్టణ కేంద్రంలోని సీఎంఆర్ కాలనీ సమీపంలో గల హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నక్షత్రాల వన మహోత్సవం' కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రుగు ప్రవంతి సతీష్ దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ దంపతులు మొదట హనుమాన్ దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల నుండి ఆశీర్వచనాలు అందుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 27 రకాల నక్షత్రాల మొక్కలలో, తమ జన్మ నక్షత్రానికి సంబంధించిన మొక్కను సర్పంచ్ సంద్రుగు ప్రవంతి సతీష్ దంపతులు ఎంతో భక్తిశ్రద్ధలతో నాటారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మికతను పెంపొందించేలా ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్చక తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాలబ్రహ్మం



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్ :హైదరాబాద్ నగరంలోని తుల్జా భవన్ లో తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్యం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ గారి ఆధ్వర్యంలో భూర్గోజు భాలబ్రహ్మము తిమ్మారెడ్డిపల్లి అంజనేయ స్వామి దేవాలయ అర్చకుని తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమిస్తూ శాలువాతో సన్మానం చేయడం జరిగింది. ఇట్టి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరేశ్వర శర్మ, కోశాధికారి హరికృష్ణ శర్మ, అధికార ప్రతినిధి మనోహర్ శర్మ, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరభద్రయ్య, గార్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు. బాలబ్రహ్మము మాట్లాడుతూ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి అర్చకుల ఉద్యోగ భద్రతకు నా సాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. పాఠశాలల ఆధునికీకరణ పై ఎంఈఓ లు ప్రధానోపాధ్యాయులతో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి క్లాస్ రూమ్‌లోనూ సరిపడా గాలి, వెలుతురు ఉండేలా చూడాలని, విద్యార్థులు కూర్చునే బెంచీలు సౌకర్యవంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్ కుమార్ డి ఈ రమేష్ ఏఈ ఓబులేష్ తదితరులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు

# మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి...



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్డ్రైనేజీ డిజైన్‌ను తక్షణమే ఖరారు చేసి పూర్తి కార్యాచరణ నివేదిక ఇవ్వాలి పెండింగ్‌లో ఉన్న రెండు స్ట్రెచ్‌లలో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణం, భూ సేకరణ, లేఅవుట్ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, భూసేకరణ, డ్రైనేజీ, లేఅవుట్ అభివృద్ధి, తదితర అంశాలను నిర్దిష్ట గడువుల్లోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు.కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనుల పురోగతి, ఎన్ఎస్‌పీ భూముల్లో లేఅవుట్ అభివృద్ధి, డ్రైనేజీ డిజైన్, భూసేకరణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూలి ఎన్ఎస్‌పీ భూముల్లో లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి అధికారులు అప్రోచ్ రోడ్డు, వంతెన నిర్మాణ ప్రతిపాదనలు సమర్పించారని, అయితే జాతీయ రహదారుల శాఖ ఇంజినీర్ సూచించిన విధంగా నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుపై సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి, సవరించిన తుది ప్రతిపాదనను రెండు రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.మున్నేరు పరిరక్షణలో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ రూపకల్పనను అత్యవసరంగా ఖరారు చేయాలని సూచించారు. ప్రధాన డ్రైన్లు, ఉప డ్రైన్లు ఎక్కడ ఉంటాయి, ఆయా డ్రైన్ల ద్వారా నీరు ఎక్కడికి మళ్లించబడుతుంది, మొత్తం డ్రైనేజీ నెట్‌వర్క్ ఎలా పనిచేస్తుందనే అంశాలతో కూడిన సమగ్ర సాంకేతిక నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు ఆదేశించారు.భూసేకరణ పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలు మినహా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్న రెండు స్ట్రెచ్‌లలో పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.లేఅవుట్ అభివృద్ధి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను పూర్తిగా వివరించి, సానుకూల దృక్పథం ఉన్న భూ యజమానులతో వెంటనే చర్చలు ప్రారంభించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల్లో అపోహలు తొలగేలా పూర్తి అవగాహన కల్పిస్తూ పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.మతపరమైన నిర్మాణాలు, శ్మశానవాటికలు వంటి సున్నితమైన అంశాల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు ముందుకు సాగాలని, సాంకేతిక అంశాలు, భూసేకరణ, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల ఈఈలు, డీఈలు, ఖమ్మం అర్బన్ తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శివంపేట్ లో గంజాయి కలకలం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా జులై 14 : 33 గ్రాముల స్వాధీనం!! ఇద్దరు అరెస్ట్ రిమాండ్ కు తరలింపు!! నమ్మదగిన సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తులు శివంపేట గ్యాస్ గోదాం దగ్గరలో గంజాయి సరఫరా చేస్తున్నారన్న సమాచారం మేరకు శివంపేట ఎస్సై మధుకర్ రెడ్డి తన సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని విచారించగా వారి దగ్గర దాదాపు 33 గ్రాముల గంజాయి లభించడం జరిగింది,వారు దానిని శివంపేట మండలంలోని కొంతమందికి అమ్మే ప్రయత్నం చేయడానికి తెచ్చారని దానిద్వారా ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశతో ఈ విధంగా చేశామని చెప్పడం జరిగింది ఇట్టి గంజాయిని సీజ్ చేసి వారి మీద ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి రిమాండ్ చేయడం జరుగుతుందిఅదేవిధంగా వారిద్దరి దగ్గర నుంచి రెండు సెల్ ఫోన్లు కూడా సీజ్ చేయడం జరిగింది. అరెస్టు అయిన నిందితుల వివరాలు 1)మార్తమన్ గణేష్ తండ్రి యాదగిరివయస్సు 26, నివాసం శభాష్ పల్లి,2) గౌర హమేత్ సింగ్ తండ్రి పురమ్ సింగ్ వయస్సు: 32 నివాసం తూప్రాన్ వీరిద్దరిని రిమాండ్ కు తరలించడం జరిగిందని అన్నారు.

## జ్యోతిరావు పూలే సబ్ ప్లాన్ అమలు చేయాలి
## బీసీ హక్కుల సాధన సమితి ధనుంజయ నాయుడు డిమాండ్




మేడ్చల్ (మన ప్రజాప్రతినిధి దినపత్రిక) మంగళవారం మేడ్చల్ జిల్లా కూకట్ పల్లి సిపిఐ కార్యాలయంలో బీసీ ముఖ్య నేతలతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో జ్యోతిరావు పూలే సబ్ ప్లాన్ అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు ప్రతి బడ్జెట్లోనూ బీసీలకు నిధులు కేటాయిస్తున్నారే కానీ విడుదల చేయడం లేదని విడుదల చేసిన కొద్దిపాటి నిధుల్లో పదో వంతు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు ఖర్చు పెడతామని అన్నారని గత మూడు బడ్జెట్లలో బీసీ కోసం ఖర్చు చేసింది కేవలం 6000 కోట్ల రూపాయలు మాత్రమేనని ఐదు సంవత్సరంలో లక్ష కోట్లు బీసీలకు కేటాయిస్తామని ప్రకటించారని ఆచరణలో చేసింది శూన్యమని ఇప్పటికీ సుమారు పదివేల కోట్ల రూపాయల ఫీజు రియంబర్స్మెంట్ నిధులు పెండింగ్ లో ఉన్నాయని బీసీ కార్పొరేషన్లకు కనీసం 50 వేల కోట్లు కేటాయించాలని స్వయశీ ఉపాధి పథకాలను పునరుద్ధరించాలని కులాల వారీగా లబ్ధిదారుల డేటా విడుదల చేయాలని జనాభా నిష్పత్తిలో బీసీలకు బడ్జెట్ వాటా ఇవ్వాలని బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడటం ఇక ఆపాలని బడ్జెట్లో బీసీలకు న్యాయం జరగకపోతే “తెలంగాణ రైజింగ్ 2047“ “3 ట్రిలియన్“ వంటి లక్ష్యాలు బీసీలకు అర్థరహితంగా మారిపోతాయి అని ఆయన అన్నారు ఇప్పటికే ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయి అని బీసీలు ప్రభుత్వ తాయులాల మీద ఆధారపడే పరిస్థితి ఏర్పడిందని బడ్జెట్లో అంకెలు కాదు, నిజంగా నిధులు విడుదలే వారి భవిష్యత్తును నిర్ణయిస్తుందని బడ్జెట్లో బీసీలకు వాటా ఇవ్వడం ఉపకారం కాదని అది బీసీల హక్కు అని కేటాయింపు చేసిన నిధులువిడుదల చేయకపోవడం ప్రకటనలు చేసి అమలు చేయకపోవడం ఇది పరిపాలన వైఫల్యం కాదని ప్రజలను మోసం చేసి ఒక రాజకీయ ధోరణి అని అన్నారు బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు అంబటి బాపురాజు ప్రధాన కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వద్ద డబ్బు లేదని పాలకులు చెబుతున్నారని కానీ అది వాస్తవం కాదని భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులకు డబ్బు ఉంటుంది ప్రచార ఆర్భాటాలకు కూడా డబ్బు ఉంటుంది ఆడంబరాలకు ఈవెంట్లకు డబ్బు ఉంటుంది కానీ బీసీ విషయంలో మాత్రం డబ్బులు లేదని కార్పొరేషన్లకు నిధులు విడుదల చేసేందుకు డబ్బులు ఉండవని అంటే సమస్య.....వనరుల కొరత కాదని బీసీలంటే చులకన భావన ఉండడం వల్లే వారు ఏమీ చేయలేరని అహంకార భావన రావడం వల్ల బీసీలను పాలకులు మోసం చేస్తూనే ఉన్నారని ఇకనైనా బీసీలు కళ్ళు తెరిచి వాస్తవాలు గ్రహించి ఉద్యమాల బాట పట్టాలని ఆయన కోరారు వారి వెంట బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే ప్రవీల, జిల్లా ఉపాధ్యక్షురాలు జే లక్ష్మి కే మనోహరాచారి ఉన్నారు

# ఫోటో రైట్ అప్ ...



నేరేడుచర్ల //(మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల లోని శ్రీ కోదండ రామాలయంలో శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా మంగళవారం సాంప్రదాయ సిద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ పూజారి రవికుమార్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శ్రీ కోదండ రాముడు, సీతమ్మ, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు ఆవు పాలు, ఆవు పెరుగు, పంచదార,తేనె, గంధం, వివిధ రకాల పండ్ల రసాలతో భక్తులచే ప్రత్యేక అభిషేకాలు చేశారు.ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో, పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించి నీరాజనం మంత్రపుష్పం, పుష్పార్చన, తీర్థ ప్రసాద వినియోగము చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు, అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరు కావడంతో ఆలయ మండపం కిక్కిరిసిపోయింది, ఈ పూజా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొణతం సత్యనారాయణ రెడ్డి, పులిజాల వెంకట రమణారావు, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తాటికొండ వెంకటరెడ్డి, ఉప్పల కృపాకర్, పొనుగోటి జంగారావు,చింతకుంట్ల శ్రీనివాసరావు మాశెట్టి సైదయ్య, జెట్టి వెంకన్న చింతకుంట్ల శ్రీనివాస్, మురారి శెట్టి రమేష్ ,కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్, కత్తి సుధాకర్ రెడ్డి, తాటికొండ సత్యనారాయణ రెడ్డి, తాటికొండ నర్సిరెడ్డి, కాంపెల్లి నారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, కొక్కండ్ల వెంకటేశ్వర్లు, మొగిలిచర్ల అనిల్, వెంకట్ రెడ్డి, రత్నం, శావయ్య, మహిళలు పాల్గొన్నారు

## ఫోటో రైట్ అప్
## అమావాస్య అన్నదానానికి మంచి స్పందన



నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ):శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి సేవా కమిటీ వారి ఆధ్వర్యం లో మంగళవారం నిర్వహించిన అమావాస్య అన్నదానానికి మంచి స్పందన లభించింది. దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి సుమారు 600 మంది నిరుపేదలు, బాటసారులు హాజరై అన్నదానాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా మహా అన్నదాన సంతర్పణ కు సహకరించిన దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో కందిబండ శ్రీనివాసరావు, వుట్కూరు నటరాజ్ , జులూరి అశోక్, జగిని సురేష్, నీలా రామూర్తి గజవెల్లి నర్సింహ్మారావు చాందా కిషన్,తడకమళ్ల పరమేశం, పోతుగంటి సత్యనారయణ,గుండా సత్యనారాయణ,అనంతుల సత్యనారాయణ, రాచకొండ రవి,రాచకొండ విజయ్ తాళ్లూరి శ్రీనివాస్, గుంటూరు శ్రీనివాస్, వీరమళ్ల శ్రీనివాస్,చారగుండ్ల వెంకటేశ్వర్లు,పాలువాయి గోపాలకృష్ణ. కొక్కండ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ ఘాతంతో మృతి



నేరేడుచర్ల, //ప్రజా ప్రతినిధి దినపత్రిక ):నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్నె గ్రామంలో విద్యుత్ ఘాతంతో ఒకరు మృతి చెందినట్లు నేరేడుచర్ల ఎస్ఐ చల్లమళ్ల గోపాల్ రెడ్డి తెలిపారు. పెంచికల్ దిన్నె గ్రామానికి చెందిన రాచూరి శ్రీనివాస్ (46) ప్రైవేటుగా కరెంటు పనిచేస్తున్నాడు. పెంచికల్ దిన్నె లోని వ్యవసాయ భూమిలో విద్యుత్ సమస్య ఉండడం తో మరమ్మతుల కోసం ఒక రైతు తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ప్రమాద వశాత్తు ఆయన విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయని వెంటనే అతన్ని హుజూర్నగర్ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం పంపించగా మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు రాచూరి మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం హుజూర్నగర్ ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఎస్ఐ తెలిపారు

# కర్ణాటకకు ఏఐ రాజధాని లక్ష్యం

బెంగళూరు, జూలై 14 (మనప్రజాప్రతినిధి): బెంగళూరులో నిర్వహించిన “గూగుల్ ఐ/ఓ కనెక్ట్ ఇండియా2026“ కార్యక్రమాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రాన్ని దేశానికి కృత్రిమ మేధస్సు రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. సాంకేతిక రంగంలో కర్ణాటక ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని, భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు రంగంలోనూ అగ్రస్థానంలో నిలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రపంచంలోని అత్యుత్తమ ఐదు కృత్రిమ మేధస్సు నగరాల్లో బెంగళూరు ఒకటిగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశంలోని మొత్తం యూనికార్న్ సంస్థల్లో దాదాపు 40 శాతం కర్ణాటకలోనే ఉన్నాయని తెలిపారు. గత విజయాలతో సంతృప్తి చెందకుండా రాష్ట్రాన్ని సాంకేతిక రంగంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు స్పష్టమైన కార్యాచరణతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.ఈ లక్ష్యాన్ని సాధించేందుకు దేశంలోనే తొలి, అతిపెద్ద కృత్రిమ మేధస్సు విశ్వవిద్యాలయం, కృత్రిమ మేధస్సు ఆవిష్కరణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కృత్రిమ మేధస్సు విద్యను పరిచయం చేయడంతో పాటు, ఈ రంగానికి అవసరమైన అత్యాధునిక మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. బెంగళూరు సమీపంతో పాటు తీర ప్రాంత జిల్లాల్లో పర్యావరణహిత అత్యాధునిక సమాచార నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే “బియాండ్ బెంగళూరు“ విధానంలో భాగంగా మైసూరు, మంగళూరు, హుబ్బటాటకధారవాడ, బెలగావి, కలబురగి నగరాలను కూడా ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.సాంకేతికత మనుషులను భర్తీ చేయడానికి కాదని, వారి సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడాలని ప్రభుత్వం విశ్వసిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. రైతులకు కన్నడ భాషలో ధ్వని రూపంలో వ్యవసాయ సలహాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు సాంకేతిక సహాయం, విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తొలి వినియోగదారుగా వ్యవహరించే విధానాన్ని అమలు చేస్తున్నట్లు డి.కె. శివకుమార్ వెల్లడించారు. కృత్రిమ మేధస్సు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడులను ఆకర్షిస్తూ కర్ణాటకను దేశంలోనే అత్యంత శక్తివంతమైన సాంకేతిక రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.

